క్లుప్తంగా

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

తుంగతుర్తి : తుగతుర్తి మండల పరిధిలోని గానుగుబండ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు శ్యాంసుందర్, ఫిరోజ్‌లను మంగళవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వ్యాస రచన పోటీలు



తిరుమలగిరిలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

తిరుమలగిరి : పోలీస్ అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా తిరుమలగిరి మండల కేంద్రంలోని ప్రగతి ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్ఐ సురేష్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకొని డ్రగ్స్‌ను నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగయ్య, డైరెక్టర్ నర్సయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడి మృతి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు నారాయణ రాఘవరెడ్డి (68) మంగళవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఆయన మృతదేహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో వివిధ పార్టీల నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, తూముల సురేష్‌రావు, నారాయణ ప్రవీణ్‌రెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, మండలి మల్లయ్య, మండలి పిచ్చయ్య, శేఖర్, సంకరమద్ది ఇంద్రారెడ్డి, నాగిరెడ్డి, శ్రావణ్‌రెడ్డి, ధనియాకుల శ్రీనివాస్, పిచ్చిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

సూర్యాపేటటౌన్ : పట్టణంలో మూడు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి నగదు, బంగారం ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీనగర్‌కు చెందిన గుమ్మడవెల్లి రాకేష్ నిర్వహిస్తున్న కిరాణాషాపు షట్టర్‌ను సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి షాపులోని రూ.60వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే వీధిలో నివాసముంటున్న జనార్దన్ ఇంటికి తాళం వేసి ఉండటంతో తాళాన్ని పగులగొట్టి రూ.6వేల నగదు దొంగిలించారు. సమీపంలో ఉన్న మారగంటి రోజా ఇంటి తాళాలు కూడా పగులగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం దోచుకెళ్లారు. మంగళవారం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

గౌడ సొసైటీ అధ్యక్షుడిగా బూడిద మల్లయ్య



నూతనకల్ : నూతనకల్ గౌడ సొసైటీ అధ్యక్షుడిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బూడిద మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సొసైటీ సభ్యుల సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సొసైటీ సభ్యులు బండపల్లి శ్రీనివాస్, రాములు, సాగర్, మహేష్, శ్రీకాంత్, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

టీపీటీయూ మండల అధ్యక్షుడిగా ఉపేందర్



నూతనకల్ : టీపీటీయూ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడిగా బత్తుల ఉపేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చుపల్లి శంకర్‌రావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిపినట్లు పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శిగా సోమగాని రమేష్‌ను, మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీటీయూ ఎన్నికల అధికారి నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

ఆత్మకూర్(ఎస్) : కళ్లు లేకున్నా పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు సాధించిన జాటోత్ భిక్షంను యువత ఆదర్శంగా తీసుకోవాలని భారత వికలాంగ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ అన్నారు. మంగళవారం కందగట్ల ఆవాసం భజన తండాలో భిక్షం దంపతులను సన్మానించారు. వికలాంగుడైన భిక్షం లూయిస్ బ్రెయిలీ లిపి ఆధారంగా కష్టపడి చదివి ఉద్యోగం సాధించాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోగుల శేఖర్ రెడ్డి, కొల్లూరు ఈదయ్య, బాబు, మంచాల వెంకన్న, మున్న మధు, కృష్ణారెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందాలి



సూర్యాపేట : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కో ఆర్డినేటర్ శ్వేత



తుంగతుర్తి : బండరామారంలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గుడిపాటి సైదులు

సూర్యాపేట : రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ శ్వేత అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రం 10వ వార్డు కుప్పిరెడ్డిగూడెంలో మంగళవారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఓ సువర్ణ, అధ్యక్షులు చెరుకుపల్లి ఉప్పమ్మ, ఆర్‌పీ రాణి, చింత వెంకన్న, ఐకేపీ కమిటీ సభ్యులు ఎల్లమ్మ, నర్సమ్మ, నీలమ్మ, తిరపమ్మ, మన్సూర, రైతులు కునుకు వెంకన్న, వెంకట్‌రెడ్డి, ఏనుగు వెంకటరెడ్డి, యాదగిరి, సురేందర్ రెడ్డి, నాగరాజు, గోపి, వెంకన్న పాల్గొన్నారు.

తిరుమలగిరి : భోక్యా తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మధుసూదన్, జీసీలు ఇద్దయ్య, మహిళా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర

అర్వపల్లి : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని అమ్మి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని ఐకేపీ ఏపీఎం వలిశెట్టి మల్లేష్



తిరుమలగిరి : భోక్యా తండాలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ హరిప్రసాద్

కోరారు. మండల పరిధిలోని కోడూరులో ఐకేపీ ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీసీ నగేష్, సంఘబంధం అధ్యక్షురాలు గుండెపురి రమణమ్మ, కార్యదర్శి గంట సుగుణమ్మ, వీఓఏ కె.సరళ, రైతులు బాకు మల్లయ్య, బిక్కి లక్ష్మయ్య, తండ బుచ్చయ్య, బాకు సోమయ్య, బిక్కి గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగారం : రైతులు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం నర్సింహులగూడెం గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణకాంత్, గ్రామీణ ఆగ్రో ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కొడవకంటి వెంకన్న, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు చిత్తలూరి ఎల్లయ్య, లింగాల నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. మంగళవారం తుంగతుర్తి, బండరామారం, మంచతండా, వెంపటి, గొట్టిపర్తి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానంద్, ఎంపీడీఓ శేషుకుమార్, ఏపీఎం రాంబాబు, సీసీలు యాదగిరి, నర్సింగ నాయక్, రైతులు ముత్తిలింగం, గడ్డం ఉప్పలయ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నూతనకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం చిల్పకుంట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, సీఈఓ సమ్మెట వెంకన్న, ఏపీఎం రమణాకర్, రైతులు పాల్గొన్నారు.



అర్వపల్లి : కోడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం మల్లేష్



నాగారం : నర్సింహులగూడెంలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య



నూతనకల్: చిల్పకుంట్లలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

ప్రజలు మూసీ ప్రక్షాళన కోరుకుంటున్నారు

- ఎమ్మెల్యే మందుల సామేల్



హైదరాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : మూసీ ప్రక్షాళన దిశగా ప్రభుత్వం మంచి నిర్ణయంతో ముందుకెళ్తోందని, మూసీ ప్రక్షాళనను ప్రజలు కోరుకుంటున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్ అన్నారు. మూసీ ప్రక్షాళనపై మంగళవారం హైదరాబాద్‌లో శాలిగౌరారం, మోత్కూరు, అడ్డగూడూరు, నాగారం, తిరుమలగిరి మండలాల ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు మూసీ ప్రక్షాళనపై ఏమి మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని ఆరోపించారు. మూసీని ప్రక్షాళన చేస్తే ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని ప్రజలందరూ స్వాగతించాలని అన్నారు. గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన జరిగితే ప్రజలకు మంచి నీరు అందుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్ని గ్యారంటీలను వంద శాతం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు, గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి, వంగాల సత్యనారాయణ, పైళ్ల సోమిరెడ్డి, పాక్స్ చైర్మన్లు వెంకటేశ్వర్లు, కప్పుల నిరంజన్‌రెడ్డి, కంచర్ల యాదగిరి రెడ్డి, మూల అశోక్‌రెడ్డి, ఆకుల బుచ్చిబాబు, సుధాకర్, లింగయ్య, సమరం రెడ్డి, జమ్మిలాలు, జనార్దన్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



చివ్వెంల జెడ్పీహెచ్ఎస్‌లో నిరసన తెలుపుతున్న టీపీయూఎస్ నాయకులు

చివ్వెంల : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చివ్వెంల జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పెండింగ్ డీఏ, పీఆర్సీలను చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీలను చెల్లించాలని కోరుతూ మంగళవారం ఏపూరు జెడ్పీహెచ్ఎస్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాసిత్, జూలకంటి వెంకట్ రెడ్డి, పబ్బతి వెంకటేశ్వర్లు, వెంకటేష్, నగేష్, వేణు, నాగేందర్, రమణ, విజయ, పుష్పలీల, పద్మ, సూర్య కళ, మోహన్, రవికుమార్ పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన

సూర్యాపేట టౌన్ : పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పోలీస్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. అలాగే సీఐ, ఎస్ఐ, కానిస్టేబుల్స్‌ను ఎలా గుర్తు పట్టాలి, ప్రజలకు పోలీసులు అందించే సేవలు తదితర విషయాలపై వివరించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఎన్నికల్లో పట్టుబడిన మద్యం ధ్వంసం



మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

తుంగతుర్తి : ఎన్నికల సమయంలో పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన మద్యాన్ని మంగళవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్, ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ శ్రీనునాయక్ మాట్లాడారు. 2023–2024 సంవత్సరంలో తుంగతుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 16 లిక్కర్ కేసులకు సంబంధించి 150 లీటర్ల మద్యం, 800 లీటర్ల బీర్లు, 10 లీటర్ల సారాయి పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యాన్ని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ రజిత, ఎస్ఐ క్రాంతికుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధితో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ



సూర్యాపేట : కాంగ్రెస్‌లో చేరుతున్న వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న దామోదర్ రెడ్డి

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి

సూర్యాపేట : రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఆత్మకూరు మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన వందమంది బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి దామోదర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ బొక్క గంగారెడ్డి, అరుట్ల వినోద రెడ్డి, సామ గంగారెడ్డి, బుర్రెడ్డి మల్లారెడ్డి, పన్నాల సాంబారెడ్డి, పులగం రాంరెడ్డి, ఆలకుంట్ల వెంకన్న, భిక్షపతి, రవి, పొన్నం శ్రీను, మట్టిపల్లి రవి, దండ గణేష్, రాచకొండ సైదులు, నాగయ్య, సంద్ర సందీప్, ఏలేందర్, విష్ణు, కళ్యాణ్, వినయ్, శ్రీను, మహేష్, నగేష్, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి ఆర్డీఆర్ పరామర్శ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోరపాక సత్యంపై కొంత మంది కాంగ్రెస్ వలసవాదులు ఇంటికి పిలిచి దాడిచేయడం తగదని మాజీ మంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అర్వపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యంను ఆయన పరామర్శించారు. అనంతరం జరిగిన కాంగ్రెస్ శ్రేణుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇటీవల తమ అవసరాల కోసం కాంగ్రెస్‌లోకి వలస వచ్చిన ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ సీనియర్లపై దాడులు చేస్తున్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేసిన నాయకులపై దాడులు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడిపాటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో సత్యంను పరామర్శిస్తున్న ఆర్డీఆర్

ప్రజానాట్యమండలితోనే ఉద్యమాలకు ఊపిరి

భానుపురి : ఉద్యమాలకు ఊపిరి ఊదిన చరిత్ర ప్రజానాట్య మండలికి దక్కుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ప్రజానాట్యమండలి జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పాటుపడే కళాకారులను తయారు చేసింది ప్రజానాట్యమండలి అని అన్నారు. నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కళారూపాలతో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామన్నారు. జిల్లా సీపీఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సాయుధ తెలంగాణ పోరాటం మొదలుకొని తెలంగాణ సాధన వరకు ప్రజానాట్యమండలి కళాకారులు పోషించిన పాత్ర అద్వితీయమన్నారు. ఈ సమావేశంలో దొంతగాని సత్యనారాయణ, దూళిపాళ్ల ధనుంజయ నాయుడు, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు జంపాల మల్లయ్య, శ్రీకాంతు, ఉపేందర్, గురుస్వామి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేయించాలి

తుంగతుర్తి : రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ నరేష్ అన్నారు. మంగళవారం అన్నారం గ్రామంలో పశువులకు టీకాలు వేసి మాట్లాడారు. గ్రామంలో 68 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది రవికుమార్, గోపాలమిత్ర కుంచాల శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దాడులకు కాంగ్రెస్ వ్యతిరేకం

అర్వపల్లి : దాడుల సంస్కృతికి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి అన్నారు. జాజిరెడ్డిగూడెంలో మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు బీరవోలు విక్రం రెడ్డిలతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తన కుటుంబం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. సోమవారం రాత్రి తన ఇంటిపై మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపాక సత్యంతో పాటు కొంతమంది వచ్చి దాడిచేశారని అన్నారు. ఎమ్మెల్యే సామేల్ వెంట నడుస్తున్న తాము అటువంటి చర్యలకు దూరంగా ఉంటామని చెప్పారు. ఈ సమావేశంలో దాసరి సోమయ్య, నర్సింగ వెంకటేశ్వర్లుగౌడ్, పూర్ణచంద్రారెడ్డి, బి.మహరాజు, సైదులు, రవీందర్ నాయక్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుడిపల్లి మధుకర్ రెడ్డి

పీడీఎస్‌యూ విద్యార్థులు విప్లవాలకు పునాదులు



సమావేశంలో మాట్లాడుతున్న డేవిడ్ కుమార్

భానుపురి : పీడీఎస్‌యూ విద్యార్థులు విప్లవ సమాజానికి పునాదులు అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్ అన్నారు. పీడీఎస్‌యూ 50 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 60 ఫీట్ నుంచి కొత్త బస్టాండ్, శంకర్ విలాస్ సెంటర్, గాంధీ పార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ పార్కులో జరిగిన అర్ధ శతాబ్ద ఉత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1974లో చారిత్రాత్మక అవసరంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటి నుంచి విద్యార్థుల సమస్యలపై పీడీఎస్‌యూ సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో అర్ధ శతాబ్ది ఉత్సవాల సభలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మాజీ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, కార్యదర్శి ఎం. చందర్ రావు, బొడ్డు శంకర్, కునుకుంట్ల సైదులు, వెంకట్ యాదవ్, గుండు వెంకన్న, ఉదయగిరి, తడకమళ్ల నాగమల్లు, నగేష్, నర్సిరెడ్డి, బొల్లె వెంకన్న, భరత్, బండి రవి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు పనిచేయాలి



మాట్లాడుతున్న మర్రి మోహన్ రెడ్డి

చివ్వెంల : బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పార్టీ సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జి మర్రి మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో పార్టీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో 200 సభ్యత్వాలకు తగ్గకుండా నమోదు చేయించాలని అన్నారు. బుధవారం నుంచి ఈ కార్యక్రమంపై మండల స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యరెడ్డి, రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు, జుట్టుకొండ సత్యనారాయణ, సలిగంటి వీరేందర్, మల్లెపాక సాయిబాబా, యశ్వంత్, కర్నాటి కిషన్, నారాయణ, చల్లమల్ల నర్సింహ, కృష్ణయ్య పాల్గొన్నారు.

చికిత్స కన్నా నివారణే ముఖ్యం

నూతనకల్ : ఎయిడ్స్ బారిన పడి చికిత్స పొందడం కన్నా దాని నివారణే ముఖ్యమని మండల వైద్యాధికారి అశ్రితారెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ బోడ నర్సయ్య అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ, సంపూర్ణ సురక్ష కేంద్రం ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ నరేష్, ఉపేందర్, సీహెచ్ఓ శరణ్‌నాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ అనిత, ఉషారాణి,తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాన్ని ఇస్తున్న మాల మహానాడు సంఘం నాయకులు

నాగారం : తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆదేశాల మేరకు ఈటూరు గ్రామంలో మంగళవారం మాల మహానాడు నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా కంచి యాకయ్య, ఉపాధ్యక్షుడిగా గుండ్ల వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా జక్కుల సందీప్, కార్యదర్శిగా పగిడిమర్రి సురేష్, కోశాధికారిగా బుంగ ఇమ్మానేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంచి రాజేష్‌తోపాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కంచి యాకయ్య మాట్లాడుతూ మాలల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన మాల మహానాడు నాయకులు గంట లక్ష్మణ్, గంట సందీప్, గోరెంట్ల సామేల్, మద్దెల ప్రభుదాస్, గంట యాకుబ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కుల రా జు, సుందరయ్య, చిన్నయాదగిరి, ఏసోబు, దాసరి ముత్తయ్య, వెంకన్న, రమేష్, శేఖర్, చింటూ పాల్గొన్నారు.

బ్లడ్ క్యాన్సర్‌తో కానిస్టేబుల్ మృతి



పరశురాం(ఫైల్)

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం మాలిపురం గ్రామానికి చెందిన పరశురాం (29) హైదరాబాద్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడు నెల రోజుల క్రితం డెంగీ జ్వరంతో హాస్పిటల్‌లో చేరాడు. అయితే రక్త పరీక్షలు జరుపగా బ్లడ్ క్యాన్సర్ వచ్చినట్లు తెలిసింది. దీంతో చికిత్స పొందుతూ మంగళవారం జూబ్లీహిల్స్ కేర్ హాస్పిటల్లో మృతిచెందాడు. కానిస్టేబుల్ పరశురాం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

రాఘవ చైతన్యకు డాక్టరేట్



రాఘవ చైతన్య

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని మాచారం గ్రామానికి చెందిన ఇటికాల రాఘవ చైతన్య ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ డిపార్ట్‌మెంట్ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టాలెంట్ మేనేజ్‌మెంట్ ఆన్ ఎంపిరికల్ స్టడీ ఆఫ్ టాలెంట్ రిటెన్షన్ స్ట్రాటజీస్ ఎట్ సెలక్టెడ్ ఫార్మాస్యూటికల్ కంపెనీస్ ఇన్ తెలంగాణ అనే అంశంపై పరిశోధన చేసినట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ చెన్నప్ప గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



దాత దేవిరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి అందజేసిన పరీక్ష ప్యాడ్‌లతో విద్యార్థులు

మద్దిరాల : గోరెంట్ల ప్రభుత్వ పాఠశాలలో తడమకమళ్ల గ్రామానికి చెందిన దేవిరెడ్డి అనిల్‌రెడ్డి మంగళవారం 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని పాఠశాలతోపాటు గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉన్నిషా, ఉపాధ్యాయులు కృష్ణవేణి, భిక్షం, శ్రీను, రమేష్, ప్రభాకర్, శిరీషా, నాగులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ పదవి ఇవ్వాలి

అర్వపల్లి : డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్‌కు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు యోగానందచారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం అర్వపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వెంకన్నయాదవ్ గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవచేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, శిగ నసీర్‌గౌడ్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దిరాల : చెవిటి వెంకన్న యాదవ్‌కు రాష్ట్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవిలమల్లు యాదవ్ అన్నారు. మంగళవారం మద్దిరాలలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో పచ్చిపాల వెంకన్నయాదవ్, సురేష్ గౌడ్, అమృతమల్లు, విజయ్, భిక్షపతి పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పారిశుద్ధ్య పనులు

అర్వపల్లి : అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగాయి. అయితే మంగళవారం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణను పరిశీలించారు. వెంటనే ఆస్పత్రి ఆవరణను శుభ్రం చేయించాలని ఎంపీడీఓ పవన్‌కుమార్‌ను ఆయన ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి మాగి నాగయ్య గ్రామ పంచాయతీ కార్మికులతో గడ్డి మందు పిచికారీ చేయించారు. గడ్డిని తొలగించి శుభ్రం చేయిస్తామని చెప్పారు.